అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు నివారణ సాధనాల పనితీరు వివరిస్తున్న ఫైర్ అధికారి

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- అగ్ని ప్రమాదాలను నివారించాలి
- పెద్దపల్లి ఫైర్ అధికారి దేవనంది శ్రీనివాస్
- ప్రైవేట్ వైద్యశాలల తనిఖీ
- ఫైర్ సేఫ్టీపై అవగాహన

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 10: వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉన్నందున ప్రైవేట్ వైద్యశాలల యాజమానులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దపల్లి ఫైర్ అధికారి దేవనంది శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ వైద్యశాలల్లో ఫైర్ అధికారి బుధవారం తనిఖీలు నిర్వహించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు జరుగకుండ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒకవేళ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఉపయోగించే సాధనాల పనితీరుపై ఆయా వైద్యశాలల సిబ్బంది, యాజమానులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సాధనాలు లేని దవాఖానలు సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఇక్కడ ఫైర్ అధికారులు ప్రవీణ్‌కుమార్, అజ్జు, ప్రైవేట్ వైద్యశాలల నిర్వాహకులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు డ్రైఫ్రూట్స్ తినిపిస్తున్న ఎమ్మెల్యేలు

జూలపల్లిలో ఇఫ్తార్

జూలపల్లి, ఏప్రిల్ 10 : మండల కేంద్రంలోని 'గోల్డెన్ ఫంక్షన్' హాల్‌లో బుధవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డ్రైఫ్రూట్స్ తినిపించి ఉపవాస దీక్షలు విరమింపజేశారు. ఒకరికొకరూ ఆలింగనం చేసుకుంటూ ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ధూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, నాయకులు గండు సంజీవ్, పొట్టాల శంకర్, బొజ్జ శ్రీనివాస్, సిరికొండ కొమురయ్య, ఏదుల్ల కన్కయ్య, ఇమామ్, ఎస్సానుల్లా, నన్నేసాహేబ్, లాల్ మహ్మద్, రషీద్, ఫజులుల్లా, ఫక్కీర్ మహ్మద్, గౌష్‌పాషా పాల్గొన్నారు.

రోడ్డు కోసం మండుటెండలో నిరసన

- తమ డివిజన్‌కు రోడ్డు కావాలంటూ మాజీ కార్పొరేటర్ బైఠాయింపు
- మద్దతు తెలిపిన స్థానికులు
- కమిషనర్ హామీతో ఆందోళన విరమణ

ధర్నా చేస్తున్న మాజీ కార్పొరేటర్ సతీశ్, స్థానికులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 10: తమ డివిజన్‌కు రోడ్డు కావాలంటూ మాజీ కార్పొరేటర్ ఒకరు మండుటెండలో నడిరోడ్డుపై నాలుగు గంటల పాటు బైఠాయించారు. డివిజన్ ప్రజలు కూడా కలిసి రావడంతో ఆందోళన తీవ్రరూపం దాల్చింది. దీనితో పెద్దపల్లిలో ఉన్న నగర పాలక కమిషనర్ ఫోన్ చేసి తప్పకుండా రోడ్డు వేయించే పూచి నాదంటూ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రామగుండం నగర పాలక సంస్థ 33, 34 డివిజన్ల పరిధి విఠల్‌నగర్ సమీపంలో బుధవారం మాజీ కార్పొరేటర్ బొబ్బిలి సతీశ్ స్థానికులతో కలిసి బైఠాయించి నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడారు. తాముంటున్న ప్రాంతం ఏ డివిజన్ పరిధిలోకి వస్తుందో ఇప్పటికి కూడా అధికారులు తేల్చడం లేదన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా గతంలోనే ఈ ప్రాంతానికి రోడ్డు మంజూరైందని చెప్పారు. కానీ, పాలక వర్గం, అధికారులు ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారం కావడంతో కావాలనే రోడ్డు పనులు చేపట్టడం లేదని, ఈ వివక్షతో డివిజన్ ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దని వేడుకున్నారు. కార్పొరేషన్, సింగరేణి అధికారులు జోక్యం చేసుకొని రోడ్డు నిర్మాణం చేపట్టడానికి ముందుకు వచ్చేంత వరకు విరమించేది లేదంటూ భీష్మించుకొని కూర్చున్నారు. అత్యవసర పరిస్థితిలో కూడా ఈ డివిజన్‌కు అంబులెన్సు కూడా రాలేని దుస్థితి నెలకొందని ఆవేదన చెందారు. సింగరేణి ఓసీపీ నుంచి వెలువడే దుమ్ము,ధూళితో అనారోగ్యాల బారిన పడుతున్నారని వాపోయారు. విషయం తెలుసుకొన్న బల్దియా కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఫోన్‌లో సంప్రదించి తప్పకుండా రోడ్డు వేయించే పూచీ నాదంటూ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన మహిళలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి, ఏప్రిల్10: జిల్లాలోని వడ్ల కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరా, వడ్ల కొనుగోలు, పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమార్ బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు జే అరుణ శ్రీ, జీవీ శ్యామ్‌ప్రసాద్, సంబంధిత శాఖ అధికారులు వీసీలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగు నీటి సరఫరాలో సమస్యలు రాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. వడదెబ్బ నియంత్రణకు పాటించాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా. కే ప్రమోద్ కుమార్, డీఈవో మాధవి, డీఏవో దోమ ఆదిరెడ్డి, డీసీవో శ్రీమాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, మిషన్ భగరథ ఇంట్రా ఈఈ శ్రీనివాస్, గ్రిడ్ ఈఈ పూర్ణ చందర్, డాక్టర్ శౌరయ్య పాల్గొన్నారు.

హిజ్రాలు సత్ప్రవర్తనతో మెలగాలి

మాట్లాడుతున్న ఎస్ఐ శ్రవణ్ కుమార్

సుల్తానాబాద్, ఏప్రిల్ 10: హిజ్రాలు మంచి ప్రవర్తనతో మెలగాలని సుల్తానాబాద్ ఎస్ఐ శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలువురు హిజ్రాలను స్థానిక పోలీస్ స్టేషన్ కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్సై శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ హిజ్రాలు బిక్షాటన చేయడం సహజమని, రాకపోకలు సాగించే ప్రయాణికులను ఇబ్బందులకు చేస్తున్నారని అలాంటివి మానుకోవాలన్నారు. అలాగే వర్తక వ్యాణిజ్య వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని సహజంగా వ్యాపారులు ఇచ్చింది తీసుకోవాలే తప్ప ఇబ్బందులకు గురి చేస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇకముందు జరిగితే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు మంచి ప్రవర్తనతో మెలిగి బిక్షటన చేయాలి తప్ప ఇబ్బందులు కుగురి చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని అన్నారు. ఇకపై మీపైన ఎలాంటి ఫిర్యాదులు రావద్దని హెచ్చరించారు

కోడ్ ఉల్లంఘించిన వారి పై చర్య తీసుకోవాలి

ఓదెల, ఏప్రిల్ 10: కనగర్తిలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ ఆరెల్లి మొండయ్యగౌడ్ కోరారు. పొత్కపల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో కనగర్తిలో వైస్ చైర్మన్ తాళ్లపల్లి సదయ్య పాల్గొని ఎమ్మెల్యే విజయరమణారావు నేతృత్వంలో ఇక్కడ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పనుల పరిశీలన

ఎలిగేడు, ఏప్రిల్10: ఎలిగేడు మండలం ఎలిగేడు, శివపల్లి, సుల్తానాపూర్,బురహన్‌మియాపేట గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను బుధవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పరిశీలించారు. బాలికల బాలుర మరుగుదొడ్లు, డ్రింకింగ్ వాటర్, ఎలక్ట్రికల్ ప్లంబింగ్ సంబంధించిన పనులను గుర్తించి వాటికి ఎస్టిమేషన్ వేయించారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్ రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, పీఆర్ ఏఈ జగదీశ్వర్, ఏపీవో సుధాకర్, అయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

గోదావరిఖని,ఏప్రిల్ 10: ఈనెల 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని స్థానిక సింగరేణి పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ పోటీలను ప్రారంభించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు అంబేద్కర్ జయంతి వేడుకల్లో జీఎం చింతల శ్రీనివాస్ బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస రావు, ఉపాధ్యాయులు స్వర్ణలత, శ్రీలత తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ముత్తారం : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబిస్తున్న ఏపీఎం పద్మ

ముత్తారం, ఏప్రిల్ 10: రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఎంపీవో బైరి వేణు మాధవ్, ఏపీఎం పద్మ కోరారు. సెర్ప్ ఆధ్వర్యంలో మండలంలోని మచ్చుపేట, హరిపురం, మైదంబండ, కేశనపల్లి, ముత్తారంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే ప్రభుత్వం అందించే మద్దత ధర లభిస్తుందన్నారు. క్వింటాల్ గ్రేడ్ ఏ రకానికి రూ. 2203, సాధారణ రకానికి రూ. 2183 ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఇక్కడ ఏఈవో హారిక, సీసీలు తిరుపతి, రాజ్యలక్ష్మి, రాధిక, కమిటీ సభ్యులు, హమాలీలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర

రామగిరి, ఏప్రిల్ 10: రైతులు తాము పం డించిన వరి ధాన్యం నేరుగా గ్రామాల్లో ఏర్పా టు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఎంపీడీవో శైలజ కోరారు. బుధవారం మండలంలోని బేగంపేట, ముస్త్యాల గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం స్వరూపరాణి, సీసీలు రమేశ్, బాపు తదితరులు పాల్గొన్నారు.

రామగిరి : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

తల్లిదండ్రుల తర్వాత గురువులే గొప్ప



బదిలీపై వెళ్తున్న హెచ్ఎంను సన్మానిస్తున్న మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు

జ్యోతినగర్, ఏప్రిల్ 10: ప్రతీ విద్యార్థికి తల్లిదండ్రుల తర్వాత గురువుల స్థానం గొప్పదని ఉమ్మడి రామగుండం మండల విద్యాధికారి ఆరెపల్లి రాజయ్య అన్నారు. బుధవారం ఎన్టీపీసీలోని దుర్గయ్యపల్లి ప్రభుత్వ పాఠశాలలో జరిగి విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీలో పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులను ప్రయోజకులుగా మార్చేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్ రజిత కమాన్‌పూర్ జడ్పీ హైస్కూల్‌కు బదిలీతో వేదికపై ఆమెను మండల విద్యాధికారి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇక్కడ పాఠశాల హెచ్ఎం సుద్దాల రేణుక, ఉపాధ్యాయులు బేబి రాణి, ఆకుల రాజన్న, రాములు, ప్రశాంతి, రంజిత, లక్ష్మణ్, రమణ, దేవిక, తదితరులు ఉన్నారు.

16న ఇంగ్లిష్ పరీక్ష

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 10 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఎస్సీ డిజైనింగ్, టెక్నాలజీ 3వ సెమిస్టర్ ఇంగ్లిష్ పరీక్ష ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేములవాడలోని ధార్మిక డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంగా కేటాయించినట్లు వెల్లడించారు.

ఫీజు చెల్లింపునకు గడువు 22

ఎస్‌యూ పరిధిలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ ఫీజు చెల్లించేందుకు ఈ నెల 22వ తేదీ ఆఖరు గడువు అని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుము రూ. 300తో 25వ తేదీ వరకు చెల్లించవచ్చని సూచించారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 10: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఎస్ఐ దత్తుప్రసాద్ శర్మ సూచించారు. రంగంపల్లి శివారులో ట్రాఫిక్ ఎస్ఐ సహదేవ్ సింగ్‌తో కలిసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. పెండింగ్ చలాన్లు కట్టకుండా తప్పించుకు తిరుగుతున్న వాహనదారులకు అవగాహన కల్పించారు. నెంబర్ ప్లేట్ కనబడకుండా మార్ఫింగ్ చేసినా, స్టిక్కర్లు అంటించిన నేరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలను సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఇక్కడ ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు ఉన్నారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు

రామగిరి, ఏప్రిల్ 10: సింగరేణి ఆర్జీ-3 ఓసీపీ-2 వద్ద రాగి వైరు దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు మంథని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రామగిరి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం అరెస్టు వివరాలు వెల్లడించారు. ఈనెల 5న ఓసీపీ-2 వద్ద రాగి వైరు చోరీ చేసిన సంఘటనలో బుధవారం ఉదయం నాగెపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఎస్ఐ సందీప్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ఒక సంచితో కనపించారు. వారిని సోదా చేయగా 24 కిలోల కాపర్ వైరు లభించినట్లు తెలిపారు. నవాబ్‌పేటకు చెందిన పస్తాం తిరుపతి, సుల్తానాబాద్ మండలం దేవులపల్లికి చెందిన మోటం అజయ్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఓసీపీ-2 నుంచి రాగి వైరు దొంగతనం చేసినట్లు అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సింగరేణి అమరవీరుల స్మారక స్తూపం నిర్మించాలి

- టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి

మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, ఏప్రిల్ 10: సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమర కార్మిక యోధుల స్మారక చిహ్నాన్ని యాజమాన్యం నిర్మించాలని టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 134 సంవత్సరాల సింగరేణి సంస్థలో మినుగురు పురుగుల కాంతిలో బొగ్గు తవ్వకం పనులను ప్రారంభించి నేడు ఎల్ఈడీ లైట్లు ద్వారా 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించే స్థాయికి చేరుకున్నదని అన్నారు. సింగరేణి పురోభివృద్ధికి తమ స్వేదం రక్తంను ఛిందించిన కార్మికులకు ఎల్లకాలం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ కార్మిక పోరాటాలను మలుపుతిప్పిన మేడే సందర్భంగా బొగ్గు ఉత్పత్తిలో అసువులు బాసిన సింగరేణి కార్మికుల స్మారక కేంద్రం నిర్మించడం గౌరవ ప్రదంగా ఉంటుందన్నారు. భావితరాలకు బొగ్గు గనులలో దుర్భర పని పరిస్థితిఉలు కార్మికుల త్యాగం విలువలు తెలియజెప్పడానికి దోహదపడుతుందన్నారు. ప్రపంచంలోనే ఇతర పారిశ్రామిక దేశాలలో కార్మిక కేంద్రాల అభివృద్ధి నమూనా ఇక్కడ కూడా అమలుపర్చడం సబబుగా ఉంటుందన్నారు. 138వ మేడే సందర్భంగా అమరుల స్మారక కేంద్రానికి భూమి పూజ నిర్వహించాలన్నారు. నాయకులు నూనె కొంరయ్య, మాదాసి రాంమ్మూర్తి, పర్లపల్లి రవి, జాహిద్ పాషా, పొలాడి శ్రీనివాస రావు, చల్ల రవీందర్ రెడ్డి, గోపి, రాజ్‌కుమార్, పాశం శ్రీనివాసరెడ్డి, సురేందర్, శంకర్, శేషగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ముత్తారం, ఏప్రిల్ 10: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని పంచాయితీ కార్మికుల యూనియన్ మండల అధ్యక్షుడు గజ్జల రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ముత్తారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత గ్రామపంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లు, గ్రామ కార్యదర్శుల పాలన మూడు నెలలుగా కొనసాగుతుంది. అప్పటినుంచి నేటి వరకు ఒక్క నెల జీతం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో జీతం చెల్లించకపోవడంతో కుటుంబాన్ని పోషించుకోవడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు జీతాలు చెల్లించి వారిని ఆదుకోవాలని కోరారు.

గ్యాస్ సిలిండర్ల డోర్ డెలివరీ లేక ఇబ్బందులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 10: మూడు నెలలుగా గోదావరిఖనిలో సింగరేణి కార్మిక కుటుంబాలకు ఇండేన్ గ్యాస్ డోర్ డెలివరి లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని, మార్పు అంటే ఇదేనా అని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేశ్ రామగుండం ఎమ్మెల్యేను ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఏలాంటి ఇబ్బందులు లేకుండా కార్మికులు, రిటైర్డు కార్మిక కుటుంబాలకు ప్రతి నెల సమయానికి వంట గ్యాస్ సిలిండర్లు డోర్ డెలివరీ చేశారని, ప్రభుత్వం మారాక సింగరేణిలో కూడా వంట గ్యాస్ డోర్ డెలివరీలో అవకతవకలు భారీగా పెరిగిపోయాయనీ ఆరోపించారు. కొన్ని ప్రాంతాలకు మూడు నెలలుగా డోర్ డెలివరీలో పారదర్శకత లోపించిందనీ, ఈ విషయమై అధికారులను అడిగితే డోర్ డెలివరీ సిబ్బంది సమ్మె చేస్తున్నారని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని పేర్కొన్నారు. అటు కాంట్రాక్టర్, ఇటు యాజమాన్యం మధ్య సమన్వయ లోపంతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఎమ్మెల్యే , సింగరేణి ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సిలిండర్లు డోర్ డెలివరీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో వీడ్కోలు సందడి

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ధర్మారం,ఏప్రిల్10:ధర్మారం మండలంలోని కటికెనపల్లి,రచ్చపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం వీడ్కోలు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.5వ తరగతి పూర్తయిన విద్యార్థులకు వీడ్కోలు వేడుకలను చేపట్టారు.పాఠశాలలో గడిపిన విషయాలను విద్యార్థులు నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల హెచ్ ఎంలు సురకంటి ప్రభాకర్ రెడ్డి,సముద్రాల వంశీ మోహన చార్యులు మాట్లాడుతూ ప్రాథమిక విద్య పూర్తి చేసుకొని ఉన్నత పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలఉపాధ్యాయులు నూతి మల్లయ్య, నిమ్మల రేవతి, వీవీ పొన్నం సంధ్య, సేవిక అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ రామడుగు భాగ్యలక్ష్మి, వివోఏ నేవూరి పుష్పలత, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రోడ్డు ప్రమాదం: ఎన్టీపీసీ వాసి మృతి

నరేశ్(ఫైల్)

జ్యోతినగర్, ఏప్రిల్ 10: ఎన్టీపీసీ పట్టణ పరిధి ఐదోడివిజన్ నర్రశాలపల్లికి చెందిన దాసరి నరేశ్(30) మంగళవారం రాత్రి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నరేశ్ తల్లిదండ్రుల స్వగ్రామం వరంగల్. ఎన్టీపీసీకి వలస వచ్చి స్థిరపడ్డారు. నరేశ్ విద్యాభ్యాస్యం ఇక్కడే జరిగింది. మైనింగ్ బీటెక్ చదువుకున్న నరేశ్ భార్య అఖిలతో కలిసి ఏడేళ్ల క్రితం గుంటూరుకు వెళ్లి ఓ గ్రానైట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళ వారం రాత్రి విధులు ముగించుకోని ఇంటికి బయలుదేరగా వాహనం ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. నరేశ్ మృతితో నర్రశాలపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆపదలో ఉన్నాడు.. ఆదుకోరూ

రామగిరి, ఏప్రిల్ 10: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన కన్నాల రమేశ్ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ ఆపదలో ఉన్నాడనీ, దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. 20 రోజులుగా హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రమేశ్ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమేనని, ఇప్పటివరకు హాస్పిటల్‌లో రూ.16లక్షలకు పైగా ఖర్చు అయిందని వివరించారు. ప్రతి రోజూ దాదాపు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందని, ఆర్థిక పరిస్థితి బాగా లేనందున దాతలు ముందుకు వచ్చి సాయం అందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. కన్నాల రాజ్‌కుమార్ గూగుల్ పే, ఫోన్ పే నం. 76010 87602కు దాతలు వీలైనంత సాయం అందించాలని కోరుతున్నారు.